
# కోరిక

- వడ్డీ ఓంప్రకాష్ నారాయణ్




నాలుగు రోజుల నుంచీ రఘురామయ్య కాలు గాలిన పిల్లిలా ఈ గది లోంచి ఆ గది లోకి, ఆ గదీ లోంచి ఈ గది లోకి తిరుగుతూనే ఉన్నాడు. ఆయన వాలకాన్ని గమనిస్తున్న అన్నపూర్ణమ్మ వస్తున్న నవ్వుని అవుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉంది.

"ఇంకా పోస్ట్ రానే లేదు." ఆయనలో ఆయనే గొణుక్కుంటూ వరండా లోని వాలు కుర్చీలో చేరగిలబడ్డాడు.

ఇద్దరి మధ్య ఉన్న మౌనాన్ని ఛేదించడం ఇక ఆవిడ వంతే అయ్యింది. "పిల్లలు వెళ్ళి వారం కాలేదు. అయినా భవాని ఇంటర్వ్యూలో కచ్చితంగా నెగ్గుతుంది. ఊరికే కంగారు పడటా రెందుకు?" కాఫీ గ్లాసును ఆయన చేతి కందిస్తూ అం దామె.

"నాలుగు రోజుల కిందటే అయ్యింది ఇంటర్వ్యూ. కనీసం ఓ టెలిగ్రాం ఇస్తే సరిపోతుంది గదా! మన కంగారు ఈ పిల్లలు చస్తే అర్థం చేసుకోరు." చదివిన పేపర్నే మళ్ళీ తిరగేస్తూ అన్నా డాయన. వినీ విన నట్లు ఆవిడ వంటింట్లో కెళ్ళింది.

ఇంతలో పోస్ట్‌మాన్ వచ్చి కవ రిచ్చి వెళ్ళాడు.

"అనూ! ఢిల్లీ నుంచి ఉత్తరం వచ్చింది. ఓ మా రిలా రా!" ఆనందంతో భార్య పట్ల గల ప్రేమ నంతా సంబోధనలో ఒలకబోశాడు రఘురామయ్య.

తండ్రితో పిల్లలకి ఎంత అనురాగం ఉన్నా - పిల్లల మనస్సు లోని మంచి, చెడు భావాల్ని కూలంకషంగా గమనించే అవకాశం తల్లికే ఎక్కువగా ఉంటుంది. కట్టుకున్న భర్త మనస్సుని. కని పెంచిన పిల్లల మనస్తత్వాన్ని ఎప్పుడో చదివేసిం దావిడ. టెలిగ్రాం ఇవ్వకుండా తండ్రిని ఆందోళనలో పెట్టా లనే రవి మనస్తత్వం ఆవిడకు బాగా తెలుసు. అందుకే ఈ నాలుగు రోజులూ ఆవిడ మామూలుగానే ఉంది. కొంగుతో చేతుల తడిని తుడుచుకుంటూ వచ్చింది వరండా లోకి. స్తంభానికి ఆనుకుని నేల మీద కూర్చుంటూ రఘురామయ్య ముఖం లోకి చూసింది.

గొంతు సవరించుకొని ఆయన ఉత్తరం చదవడానికి సిద్ధంగా ఉన్నాడు అప్పటికే.

"పూజ్యులైన అమ్మా నాన్నలకు,

"నమస్సులతో భవాని వ్రాయునది. నేనూ, రవీ క్షేమంగానే ఢిల్లీ చేరాం. నేను ఐ.ఏ.ఎస్. ఇంటర్వ్యూ బాగా చేశాను. తప్పకుండా పోస్ట్ వస్తుంది. అసలు ఇంటర్వ్యూ కాగానే నేను టెలిగ్రాం ఇద్దా మంటే రవి వద్దన్నాడు. మీకు తెలుసు కదా! నేను వాడి మాట కాదనలేను. అది నా బలహీనత. ఇంటర్వ్యూ గది లోకి అడుగు పెట్టేప్పుడు నువ్వే గుర్తు కొచ్చావ్ నాన్న! ఈ ప్రపంచంలో నన్ను అర్థం చేసుకొంది కేవలం ను వ్వొక్కడివే. నా గతాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకోవటం నీకు నచ్చ దని నాకు తెలుసు. అయినా ఈ లేఖలో నా జీవిత గమనాన్ని ఒకసారి స్మరించుకుంటాను నాన్నా. నా ఐ.ఏ.ఎస్. చదువు పూర్తి కావటం కోసం ను వ్వెన్ని రాత్రులు ఓవర్‌టైం చేశావో, నా గురించి ఎన్ని త్యాగాలకు సిద్ధపడ్డావో నాకు తెలుసు. అందుకే అసలు నే నేమిటో మరవకూడ దనుకుంటున్నా. మనస్సు పొరల్లోంచి చెరిపేసుకోమని ను వ్వెంత చెప్పినా నా గతాన్ని నేను మరవలేకపోతున్నా.

"నీకు గుర్తుంది కదా! పదహారు సంవత్సరాల క్రితం నేను మొదటి సారి మిమ్మల్ని రైల్లో విజయవాడలో కలిసినపుడు నువ్వు నన్ను అక్కున చేర్చుకోకపోతే నే నేమై పోయేదాన్నో తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది. ఒక ఆడది ఈ సమాజంలో ఒంటరిగా బ్రతకగల దనే ధీమా ఎవ్వరికీ లేదు నేటికీ! నేను నీకు ఏ మవుతా నని ఇంత కాలం పెంచావ్. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఉండ వనిపిస్తుంది... ఎప్పుడో ఏడు సంవత్సరాల వయస్సులో నే నో చిన్న కోరిక అడిగా నిన్ను - రవికి అప్పటికి బహుశా నాలుగు సంవత్సరా లుండొచ్చు. అమ్మ, నువ్వు పూరీ ఎక్స్‌ప్రెస్‌లో పూరీ వెళ్తున్నారు..."

** **

పూరీ వెళ్ళడానికి విజయవాడలో రైలెక్కిన రఘురామ్, అన్నపూర్ణ దంపతులకు, ఓ పిల్ల ఏడుస్తూ అదే కుపేలో కనిపించింది.

"ఎందుకు ఏడుస్తున్నావ్?" అడిగాడు రఘు.

"మరీ... మరీ... ఆక లేస్తోంది." భవాని ఏడుస్తూనే అంది. ఆ రేడు సంవత్సరా లుంటాయి. బొద్దుగానే ఉంది. కానీ కళ్ళలో దైన్యం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. నాలు గేళ్ళ రవి చేతిలో ఉన్న బిస్కెట్ పొట్ల వైపు ఆశగా చూస్తోంది. అన్నపూర్ణ రెండు బిస్కెట్లు ఆ పిల్ల చేతిలో పెడుతూ అడిగింది - "నీ పే రేంటి?" అని.

"భవాని."

"రైలు బయలుదేరే ట్టుంది. మీ అమ్మా నాన్నా ఎదురు చూస్తుంటారు. ఇక వెళ్ళు" అన్నాడు రఘురామ్ బుజ్జగిస్తున్నట్లు.

"నేను మా నాన్నని వదిలి వచ్చేశా."

ఆ పిల్ల మాటలకి నవ్వొచ్చింది రఘూకి. "ఏం! ఎందుకని?" ఆసక్తిగా అడిగాడు.

"మరి చదువుకోడం తప్పా?" అమాయకంగా అడిగింది.

"కాదు."

"నేను చదువుకుంటా నంటే మా నాన్న కొట్టాడు. అందుకే వచ్చేశా."

"మరి మీ అమ్మకి చెప్పకపోయావా?" అన్న ప్రశ్నకు కల్పించుకుంటూ అంది -

"మా అమ్మ మాట అస్స లినడు. రోజూ తాగొచ్చి మా అమ్మని కొడతాడు. అడ్డం వెళితే నన్నూ కొడతాడు. కావా లంటే చూడు." మోచేతి మీద దెబ్బలు చూపిస్తూ దీనంగా అంది. అన్నపూర్ణ పక్కన చొరవగా కూర్చుంది.

"బుగ్గ మీద గీరుకుపోయిం దేమిటీ? మీ ఆయన నిన్ను కొడతాడా?" అన్నపూర్ణని అడిగింది భవాని.

ఆ బుగ్గ మీద గాటుకు వేరే కారణం ఉండటంతో అనూ సిగ్గు పడుతూ - "లే దమ్మా... కొట్టరు" అంది.

"నిజంగా?"

"నిజంగానే."

వెంటనే భవానీ అన్నపూర్ణ వైపు నుంచి రఘురామ్ పక్కకు చేరింది. "నువ్వు చాలా మంచి

నాన్న నైతే." అతని చేతిని పట్టుకుని గుంజుతూ అంది.

ఆ మాత్రానికే రఘురామ్ ఆనందపడ్డాడు. "మాతో వచ్చేస్తావా? పెంచుకుంటాం" అన్నాడు.

"వస్తాను గానీ... మరీ... నాకు చదువు నేర్పుతావా?"

ఆ పిల్ల పట్టుదలకి అచ్చెరువొందాడు. "ఎంత వరకు చదువుతావ్?"

"ఏం తంటే! పెద్ద... పెద్ద చదు వన్న మాట - చెప్పు - చదివిస్తావా?" మళ్ళీ అడిగింది.

"సరే చదివిస్తాను - ఏం అనూ, ఈ పిల్లని తీసుకెళదామా?" అన్నపూర్ణని సరదాగా అడిగాడు సీరియస్‌గా.

వెంటనే భవాని అన్నపూర్ణ వైపు వెళ్ళింది.

"మరీ - ఊరికే వద్దు - నేను ఇంటి పనులన్నీ చేయగలను. మా అమ్మ కూలికి పోయినప్పుడు ఇంట్లో పను లన్నీ నేనే చేసే దాన్ని. మరీ మీ పిల్లాడు చిన్న పిల్లాడు గదా నేనే సాకుతాను. ఏడవకుండా ఆపేస్తాను. మీ బట్ట లన్నీ ఉతికిపెడతాను. నీ ప నంతా చేస్తాను. మరీ... నాకు చదువుకోవాల నుంది. తీసుకెళ్ళవూ?"

అర్తిగా అనూ మొఖంలోకి చూస్తూ అంది భవాని.

రఘురామ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పళ్ళతో కింది పెదవిని నొక్కి పెడుతూ కిటికీ వైపు తల తిప్పాడు. అన్నపూర్ణ భవానిని ఎత్తుకుని ఆప్యాయంగా హృదయానికి హత్తుకుంది.

** **

నాన్నా! ఆ నాటి నా కోరికను అహర్నిశలూ శ్రమ పడి నువ్వు తీర్చావ్. నా చదువు ఆగకుండా సాగటం కోసం కన్న కొడుకు రవి చదువును డిగ్రీతో ఆపించి వాడితో ఉద్యోగం చేయించావ్. ఇప్పటికీ వాడు నన్ను సొంత అక్కగానే భావిస్తాడు. ఈ దేశంలో నీ లాంటి వాళ్ళు కేవలం పది శాతం ఉంటే చాలు నాన్నా! అనాథల ప్రసక్తే ఉండదు. నువ్వు పెంచి పెద్ద చేసిన నేను, ఈనాడు ఈ వ్యవస్థను నడిపే స్థాయికి చేరుకున్నా. మార్గదర్శనం కోసం వినమ్రంగా ఎదురు చూస్తున్నా డాడీ... వెంటనే ఉత్తరం రాయి. అమ్మకు నా నమస్కారాలు తెలియచేయి.

నీ

"భవాని"

కండువాతో కన్నీళ్ళు ఒత్తుకున్నాడు రఘురామయ్య. తన పట్ల భవానికి గల ఆపేక్షకు అన్నపూర్ణమ్మ హృదయం ఆనందంతో నిండిపోయింది.

"అది నా కూతురే, నా కూతురు." తనలో తను అనుకున్నాడు రఘురామయ్య.

"అది సరే. రవి ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నా డన్న మాట గానీ, ఇప్పటి దాకా వాడి జీత మంతా భవాని చదువుకే ఖర్చు పెట్టాడు. మీ పింఛను మనకే చాలీచాలనట్టుగా సరిపోతుంది. చేసిన అప్పులు అలాగే ఉన్నాయ్. దాని కొచ్చే జీతం దుబారా చేయకుండా మన అప్పుల్ని తీర్చమని లెటర్ రాయండి. మన కష్టాలు తీరినట్టు అవుతాయి. భవాని చదువు కోసం చేసిన అప్పులే కదా! భవాని తన ఋణం తీర్చుకున్నట్టూ ఉంటుంది." మనస్సులో బాధనీ, కోర్కెనీ ఎలాగో భర్తకు ఏకరువు పెట్టేసిం దావిడ.

"వాస్తవాలు చేదుగానే ఉంటాయి అన్నపూర్ణా! తీర్చాల్సిన అప్పు వడ్డీతో కళ్ళ ముందు పెరిగిపోతోంది నిజమే. అయితే విషాన్ని దిగమింగితేనే అమృతం పుడుతుంది. భవాని కేవలం మన అప్పులు తీర్చే సాధనం కాకూడదు అన్నపూర్ణా! నేను అంతవరకే ఆశించి ఉన్నట్లయితే ఇంత కష్టపడి దాన్ని ఐ.ఏ.ఎస్. చదివించే వాడినే కాదు. నేను రేపు దానికో ఉత్తరం రాస్తాను. కాస్త ఆలోచించుకోనివ్వవూ? ప్లీజ్."

> **కొడుకు చదువును మధ్యలోనే ఆపేసి కూతుర్ని ఐ.ఏ.ఎస్. చేయించాడా తండ్రి. స్వలాభం కోసం కాదు. ఆ కూతురి విద్యా దాహాన్ని మరో 'లక్ష్యం' కోసం ఉపయోగించుకున్నాడు. అతని 'కోరిక' ఏమై ఉంటుంది?**

భార్య బాధని అర్థం చేసుకుంటూనే అనునయించాడు రఘురామయ్య.

**

"చి॥ భవానికి

"నీ నాన్న రాయునది. కుశలా అని తలుస్తాను. నీ ఉత్తరం చేరింది. నువ్వు పరీక్షల్లో పాస్ అయినప్పుడే ఇంటర్వ్యూలో నెగ్గుతావని నాకు తెలుసు. నా అంచనా నీ విషయంలో ఎప్పుడూ తప్పు కాలేదు. అసలు విషయానికి వస్తాను. భవానీ, నిన్ను చదివించటం వెనుక నా స్వార్థం ఒక టుంది. పెద్ద చదువులు చదువుకున్న ప్రతి వ్యక్తి విదేశాలకు వెళ్ళా లనో, మెట్రోపాలిటన్ నగరాల్లో నివసించా లనో కోరుకుంటాడు. దాన్ని నేను తప్పు పట్టను. అయితే దానికి పూర్తి భిన్నమైంది నా కోరిక.

"నీకు ఆరు సంవత్సరాల వయస్సులో నువ్వు న న్నొక కోరిక కోరావు. నేను దాన్ని తీర్చాను. నాకు అరవై సంవత్సరాలు వచ్చిన సందర్భంలో నేను ని న్నొక కోరిక కోరతాను. తీరుస్తావా తల్లీ? నా కొక 'ఆదర్శ గ్రామం' కావాలి. అవును - నేను తనువు చాలించే లోపు నా కోసం నువ్వో ఆదర్శ గ్రామాన్ని నిర్మించాలి భవానీ!

"చదువుకోవాలనే ఆశ ఉండటం నేరం కాదు. ప్రతి వ్యక్తీ చదువుకోవాలనే మన ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే చదువుకున్న యువకు లందరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు ఆ ప్రభుత్వం. మరి ఈ చదువు తన కాళ్ళ మీద తను బ్రతకగలిగే ఆత్మస్థైర్యాన్ని ఇవ్వడం లేదు. దాంతో యువత నిర్వీర్య మవుతోంది. నిరుద్యోగ రక్కసి పాదాల కింద పడి నలిగిపోతున్నారు వాళ్ళు. వాళ్ళలో ఈ దేశం పట్ల, ఈ వ్యవస్థ పట్ల దారుణమైన అసహ్య భావన మొలకెత్తి అది రోజు రోజుకూ పెరుగుతోంది. దీనికి పరిష్కారం ఏమిటి? అది ఎక్కడ మొదలు కావాలి? నువ్వెప్పుడైనా ఆలోచించావా భవానీ?

"భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభా లైన గ్రామాలు నేడు ఎడారు లవుతున్నాయి. గ్రామాల్లో యువకులు పట్టణాలకు పరిగెడుతున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం పట్టణా లన్నీ గ్రామాల మీదే ఆధారపడేవి. అప్పటి గ్రామస్తులు ఉద్యోగాల కోసం ఉరకలెత్తేవారు కాదు. అదే గ్రామంలో వారికి చేతినిండా పని, కడుపు నిండా తిండీ దొరికేవి. పారిశ్రామికీకరణం వల్ల అంతా తారుమారైంది. చదువురాని వాళ్ళు పట్టణాలకు చేరి, కూలీలుగా మారి, మురికివాడల పెరుగుదలకు కారణ మవుతున్నారు. కాస్తో,కూస్తో చదువుకున్న యువకులు నిరుద్యోగులుగా మారి విసిగి, వేసారి ఈ వ్యవస్థ మీద తిరుగుబాటు చేస్తున్నారు. గ్రామాలు మన వ్యవస్థకు వేళ్ళు లాంటివి. ఆ వేళ్ళకే చీడ పట్టింది. అక్కడ నుంచే మార్పు రావాలి.

నీకు ట్రెయినింగ్ పూర్తి కాగానే, ఏదో ఒక జిల్లాకు సబ్ కలెక్టర్‌గా వెళ్తావ్. అప్పుడు నువ్వు ఆలోచించాల్సింది నిన్ను పెంచి పెద్ద చేసిన నా గురించో, ఆప్యాయాను రాగాల్ని అందించిన అమ్మ గురించో, నీ వెనుక నీడగా నిలిచిన రవి గురించో కాదు, నీ పరిధిలో ఉన్న గ్రామాల గురించి! నీవు ప్రయాణం చేసే కారు సైతం వెళ్ళడానికి మార్గం లేని కుగ్రామాలను గమనించు. అక్కడి యువకుల్లో ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని నింపు. ఓ ఆదర్శ గ్రామం తయారు చెయ్యి. లక్షల గ్రామాలున్న ఈ దేశంలో నువ్వు దిద్దిన గ్రామం దేదీప్యమానంగా వెలుగొందిన రోజు... నీ కష్టాల వెనుక పాలు పంచుకున్న తండ్రిగా నేను ఆనందిస్తాను. నా కోరిక తీర్చినందుకు నిండు మనస్సుతో నిన్ను ఆశీర్వదిస్తాను.

"నీ

"నాన్న

"రఘురామయ్య"

ఉత్తరం రాయడం పూర్తిచేసి, దాన్ని చదివిన అన్నపూర్ణమ్మతో రఘురామయ్య అన్నాడు - "అనూ, మన బరువు బాధ్యతలను పంచుకోడానికి 'రవి' ఉండనే ఉన్నాడు. భవాని పైన నేను పెట్టిన బాధ్యత అంత కంటే పెద్దది. చిన్న చిన్న సమస్యలతో దాని 'స్థాయి' తగ్గించొద్దు అనూ - ప్లీజ్, నా మనస్సుని అర్థం చేసుకో."

ముప్పై సంవత్సరాల సాహచర్యంలో ఆయన మనస్సుని ఆవిడ ఎప్పుడో అవగతం చేసుకొంది. అందుకే ఆయన అభిప్రాయాన్ని బలపరుస్తూ ఆయన అరచేతిని తన చేతిలోకి తీసుకొని నొక్కి వదిలింది - భాషలకు అతీతమైంది గదా స్పర్శ!

*